క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, కల్యాణ అక్షింతలను అర్చకులు అందజేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అయ్యప్పస్వామి

పెందుర్తి : సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి వారి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పకు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేషాలంకరణలో స్వామి పూజలందుకున్నారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

సింహగిరిపై స్వచ్ఛ ఆంధ్ర



సింహగిరిపై రాజగోపురం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైదికులు, అధికారులు, సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్ద దేవాలయ వైదికులు, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సింహగిరిపై మాడ వీధులు, దేవాలయం పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలనే దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పారాయణదారులు, డీఈ హరి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్ట్‌టైం పీఈటీపై వేటు

- విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో చర్యలు
- చోద్యం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు



పీఈటీ నూకరాజు

గొలుగొండ: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్టు వచ్చిన ఆరోపణలు ప్రాథమికంగా రుజువు కావడంతో చోద్యం జెడ్పీ హైస్కూల్లో పార్ట్‌టైం పీఈటీగా పనిచేస్తున్న కుందూరి నూకరాజును విధుల నుంచి పూర్తిగా తొలగించారు. ఈమేరకు డీఈవో జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావునాయుడు శనివారం ఉత్తర్వులిచ్చారు. విద్యార్థుల బాధ్యత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు ఇస్తున్నట్లు చెప్పారు.

డీఈవో విచారణ

గత నెల 28న క్రీడా పోటీల కోసం పది మంది విద్యార్థులను పీఈటీ నూకరాజు తమిళనాడు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వచ్చే సమయంలో విద్యార్థినుల పట్ల ఆయన అసభ్యకరంగా ప్రవర్తించాడని శుక్రవారం వారి తల్లిదండ్రులతో కలిసి ఎంఈవోకు ఫిర్యాదులు చేసిన విషయం విదితమే. దీనిపై డీఈవో అప్పారావునాయుడు శనివారం విచారణ చేపట్టారు. ఉపాధ్యాయినుల నుంచి వివరాలు సేకరించారు. తర్వాత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు తీసుకున్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంఈవోలు సత్యనారాయణ, ఏపీఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.



ఉపాధ్యాయినుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఈవో అప్పారావునాయుడు



పెందుర్తి తహసీల్దార్, విద్యాశాఖ కార్యాలయాల మధ్య స్థలంలో మద్యం సీసాలు



చినముషిడివాడ బీఆర్‌టీఎస్ రహదారిపై నిర్మించిన వంతెన పక్కన రోడ్డుకు ఆనుకుని మద్యం సీసాలు

మందుబాబుల ఆగడాలు



పెందుర్తి : పెందుర్తి పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. రోడ్లు, లే అవుట్లు, తోటలు వేదికగా మద్యపానం, డ్రగ్స్ సేవనంతో యువకులు మత్తులో జోగుతున్నారు. వీటికి పేకాట, వ్యభిచారం వంటి జుగుప్సాకరమైన పనులు పెందుర్తి ప్రాంతంలోని బహిరంగ ప్రదేశాల్లో నిత్యకృత్యంగా మారాయి. ఇటీవల కాలంలో ఇక్కడ పెరుగుతున్న నేరాలకు ఇవి కూడా ఓ రకంగా కారణం కావడం ఆందోళన కలిగించే అంశం. ఇష్టానుసారంగా బెల్ట్ దుకాణాలు పెరిగిపోవడంతోపాటు అర్ధరాత్రి వరకు మద్యం లభించడంతో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలను మందుబాబులు ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. ఇటీవల వేపగుంట సమపంలోని ఓ మద్యం బెల్ట్ దుకాణం వద్దే ఓ రౌడీషీటర్ ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడడం గమనార్హం.

బహిరంగంగానే మందు పార్టీలు

పెందుర్తి ప్రాంతంలో ఉడాకాలనీ, పినగాడి, రాంపురం, గొరపల్లి, సరిపల్లి, రాజయ్యపేట, చినముషిడివాడ, పాపయ్యరాజుపాలెం, చింతలగ్రహారం, అక్కిరెడ్డిపాలెం, ఎస్ఆర్‌పురం, పురుషోత్తపురం, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో ఉన్న లే అవుట్లతో పాటు సబ్బవరం ప్రాంతంలో కూడా నిత్యం మందు పార్టీలు జరుగుతున్నాయి. పెందుర్తి కళాశాల సమీపంలోని కొండ ప్రాంతం, ఉడాకాలనీ, పెందుర్తి కూడలి సమీపాల్లో డ్రగ్స్ సేవనం కూడా జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు ఇతర అసాంఘిక కార్యకలపాలు కూడా విచ్చలవిడిగా సాగుతున్నాయి. పెందుర్తి నడిబొడ్డున ఉన్న వార్డు సచివాలయ భవనం మీద నిత్యం పార్టీలు జరగడం మందుబాబుల ఆగడాలకు పరాకాష్ట.

నియంత్రణ చర్యలు శూన్యం

వాస్తవానికి ఏడాది క్రితం వరకు అంతగా బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలు లేవు. అయితే ఇటీవల కాలంలో మద్యపానం, డ్రగ్స్ సేవనం, ఇతర అసాంఘిక, జుగుప్సాకరమైన పనులు బహిరంగంగా జనవాసాలకు దగ్గరలోనే జరుగుతున్నాయి. ముఖ్యంగా ఖాళీగా ఉన్న లే అవుట్లు, గ్రామాలకు సమీపంలోని తోటలు, కాలనీల్లోని పార్కులు వీరికి వేదికలవుతున్నాయి. చివరకు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు, వార్డు సచివాలయాలు కూడా బార్‌లుగా మారుతున్నాయి. అక్కడక్కడా రోడ్లపై కూడా ఇటువంటి వ్యవహారాలు సాగుతున్నాయి. దీనిపై పోలీసుల నియంత్రణ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దష్టి సారించి నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

గస్తీ పెంచుతాం



బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం పూర్తిగా నిషేధం. డ్రగ్స్ విషయం మా దష్టికి రాలేదు. కానీ ఆయా విషయాలపై తగిన చర్యలు తీసుకుంటాం. బహిరంగ ప్రదేశాల్లో రాత్రి సమయంలో గస్తీని ముమ్మరం చేస్తాం. జనవాసాలకు సమీపంలో అసాంఘిక కార్యక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తాం.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెందుర్తి : పరిసరాలతోపాటు ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా ప్రభుత్వాస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ పి.శంకర్‌ప్రసాద్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలని సూచించారు. ఆరు బయట చెత్త వేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కలిగించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛ ఆంధ్ర జిల్లా నోడల్ అధికారి డాక్టర్ హెచ్‌ఆర్‌కే దొర, సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అవంతి, వైద్యాధికారులు డాక్టర్ బి.బాబా సాహెబ్, డాక్టర్ దివ్య సౌజన్య, డాక్టర్ హరిత, హెడ్ నర్స్ లిల్లీ గ్రేస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

- రైతు బజార్‌లో ఈవో షర్మిల పద్మావతి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. రైతులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈవో పలు అంశాలపై అవగాహన కలిగించారు.
- స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ముందు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ, ర్యాలీ చేపట్టారు.



సీహెచ్‌సీలో అవగాహన కలిగిస్తున్న డీసీహెచ్ఎస్ శంకరప్రసాద్



రైతుబజార్‌లో రైతులు, వినియోగదారులతో ప్రమాణం చేయిస్తున్న ఈవో షర్మిల పద్మావతి



పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛభారత్ ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



ధ్వజారోహనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలో శ్రీ సీతారామాలయ 22వ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున కాలనీ నివాసితులు, భక్తులు హాజరై కల్యాణాన్ని కనులారా తిలకించారు. భక్తులకు స్వామివారి కల్యాణ అక్షింతలు, ప్రసాదం ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ నిర్వహించారు.

నేటి నుంచి రామచంద్రమ్మ పండగ

పరవాడ: వాడచీపురుపల్లి శివారు గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా భావించే శ్రీ రామచంద్రమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 16, 17, 18న ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. పండగను పురస్కరించుకుని దలాయిపాలెంలోని రామచంద్రమ్మ ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వాడచీపురుపల్లి గ్రామంలో రంగు రంగుల విద్యుత్ తోరణాలతో పురవీధులను అలంకరిస్తున్నారు. సంతబయలు, మెయిన్ రోడ్డులో భారీ సెట్టింగులు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉత్తరాంధ్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు, 17న జిల్లా స్థాయి కోలాట పోటీలు, 18న ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు చొప్పున బహుమతులు అందజేస్తారు. ఈ నెల 18న మంగళవారం వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. పండగ రోజున గ్రామ పురవీధుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు తెలిపారు.



దలాయిపాలెంలో కొలువుదీరిన శ్రీ రామచంద్రమ్మ అమ్మవారు

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



తులాభారం సమర్పిస్తున్న భక్తులు

పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం నివేదన చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

హెల్మెట్‌తో పునర్జన్మ



హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పోలీసులు, ఇతర వాహనదారులు

- జాగ్రత్తలతో సురక్షిత ప్రయాణం
- కుటుంబానికి అన్యాయం చేయొద్దు
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఎస్పీ

అనకాపల్లి: తల్లి జన్మనిస్తే, హెల్మెట్ పునర్జన్మనిస్తుందని.. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి, సురక్షితంగా గమ్యం చేరుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద జాతీయ రహదారి మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జెండా ఊపి ద్విచక్ర వాహనాల ర్యాలీని ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2024 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల వల్ల 313 మంది మృత్యువాత పడ్డారని, 734 మంది గాయాలపాలయ్యారని, మీ అజాగ్రత్త వల్ల కుటుంబానికి అన్యాయం చేయవద్దని ఆయన చెప్పారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపిన వారే అధికంగా మృత్యువాత పడినట్లు ఆయన పేర్కొన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. సీఎంఆర్ షాపింగ్ మాల్, సాగర్ సిమెంట్ వారి సీఎస్సార్ నిధుల నుంచి 75 స్టాపర్ బోర్డులను ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పట్టణ హోండా షోరూం యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి 30మంది పోలీస్ సిబ్బందికి ఎస్పీ ఉచితంగా హెల్మెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఆర్టీవో జి.మనోహర్, డీఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, ట్రాఫిక్ సీఐ టివి.విజయకుమార్, ట్రైనీ డీఎస్పీ ఎం.వి.కె.చైతన్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

సబ్బవరం : విద్యార్థులంతా కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. మండలంలోని మల్లునాయుడుపాలెంలోని బీసీ బాలుర వసతి గృహంతోపాటు గుల్లేపల్లిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు పరీక్షలకు సిద్ధమవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలు అంటే భయం లేకుండా ఇప్పటి వరకూ పాఠశాలలో రాసిన పరీక్షలన్నీ రివిజన్ చేసుకోవాలన్నారు. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. సాధనతో ఏదైనా సాధ్యమవుతుందన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులు ఇక్కడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సబ్జెక్టు పరంగా ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయుల సాయంతో నివృత్తి చేసుకోవాలన్నారు. పిల్లలు చదువుకునేటప్పుడు తల్లిదండ్రులు టీవీ పెట్టొద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.సాంబమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

పెందుర్తి : రానున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల ప్రణాళిక ప్రకారం ప్రతీ ఉపాధ్యాయుడు ప్రతీ విద్యార్థిని పర్యవేక్షించాలని సూచించారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ కమిషనర్ పలు అంశాలను సూచించారు. మండల విద్యాశాఖాధికారి – 2 మధుమూర్తి, హెచ్‌ఎం చొప్పర చిన్నమ్మాయి, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



క్లస్టర్ కాంప్లెక్స్‌లో డీఈవో ప్రేమ్‌కుమార్



గుల్లేపల్లిలో విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న డీఈవో అప్పారావు నాయుడు, తదితరులు



మల్లునాయుడుపాలెంలో వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు, తదితరులు

రహదారి భద్రతపై ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, తదితరులు

మద్రిపాలెం : నగరంలోని వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కోసం తాటిచెట్లపాలెం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, పద్మజ సుజుకి జీఎం రఫి శనివారం తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు, సురక్షితమైన డ్రైవింగ్ ఎలా చేయాలో అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసులు, ట్రాన్స్‌పోర్టు విభాగం, సుజుకి కంపెనీ సిబ్బందితో భారీ బైకు ర్యాలీ నిర్వహించామని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణాలు సాగించాలని ఎస్ఐ కోరారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు



ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గండి రవికుమార్, తదితరులు

సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం గ్రామంలో శ్రీకోదండ సీతారాముల వారి ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. గత 7 రోజులుగా హరే రామ హరే కృష్ణ దివ్యనామ సప్తాహం నిర్విరామంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటాన రాము, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, రాపేటి రాము, భీశెట్టి వెంకటరావు, బి.మహాలక్ష్మి నాయుడు, బోను గంగునాయుడు, మళ్ల బాలాజీ, చిరికి దేముడు పాల్గొన్నారు.

- అదేవిధంగా ఆలయ ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, సర్పంచ్ దాడి లావణ్య, కన్నంనాయుడు, నాయకులు యడ్ల నాయుడు, అప్పికొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

దళిత ఐపీఎస్ అధికారిని వేధించడం తగదు

సీతంపేట : గత ప్రభుత్వంలో సీఐడీ చీఫ్‌గా పని చేసిన ఐపీఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్ పట్ల ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును దళిత సంఘాల ఐక్యవేదిక తీవ్రంగా ఖండించింది. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ మామిడి శ్రీనివాస్ మాట్లాడుతూ సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకుని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పదే పదే మాట్లాడటం సరికాదన్నారు. దళితులు ఏ ప్రభుత్వానికీ వ్యతిరేకం కాదని, సునీల్ కుమార్‌పై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఐడీ చీఫ్‌గా పనిచేసిన ఆయన అప్పటి విధానాలు, ఆదేశాల ప్రకారం వృత్తి ధర్మంలో భాగంగా కొంత మంది రాజకీయ నాయకులపై తన సబార్డినేట్ అధికారులతో చట్టపరమైన చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వం మారగానే సునీల్‌కుమార్‌ను రాజకీయ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. విరసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ రాజ్యాంగ పదవిలో ఉన్న రఘురామకృష్ణంరాజు తను చేసిన ప్రమాణానికి భిన్నంగా, పదవిని దుర్వినియోగం చేసి సునీల్ కుమార్‌ను అరెస్టు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అంబేద్కర్ భవన్ కార్యదర్శి జె.వి.ప్రభాకర్, బీమ్ సేన వార్ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, వేమన, జల్లి రాజశేఖర్, ముత్తాబత్తుల రమేష్ పాల్గొన్నారు.